క్లుప్తంగా

ఘనంగా దత్తాత్రేయస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి మూలవిరాట్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం దత్త జయంతి పూజలు జరిపారు. వేకువజామున దత్తాత్రేయస్వామి, అనఘాదేవి ఉత్సవ మూర్తులకు పంచామృతం, పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, కుంమార్చన నిర్వహించి ప్రత్యేకంగా పూలు, వెండి కవచాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి 44 మంది రోగులను పరీక్షించి వారిలో 23 మందికి ఉచితంగా ఈసీజీ, 8 మందికి ఉచిత గుండె స్కానింగ్ పరీక్షలు చేశారు. డాక్టర్ హరిత 30 మంది రోగులకు కంటి పరీక్షలు చేసి సూచనలు చేశారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బద్వేలు అర్బన్ : తెలుగుగంగ కాలనీలోని ఆనందనిలయం నిరాశ్రయుల వసతిగృహంలో ఆదివారం గట్టుపల్లి ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రారంభం సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ గట్టుపల్లి మల్లెం కొండారెడ్డి, సెక్రటరీ గీతాల పెంచల్‌రెడ్డిల ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవసేవ అనే నినాదంతో సాటి మనిషి పట్ల ప్రేమ, దయ, జాలి, కరుణ కలిగి ఉంటేనే జీవితానికి అర్థం ఉంటుందని భావించి ట్రస్టు ఏర్పాటు చేశామని, రాబోవు రోజుల్లో పేదలను ఆదుకునేందుకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ట్రెజరర్ గట్టుపల్లి మాధవి, కమిటీ సభ్యులు, వసతిగృహం నిర్వాహకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా

ప్రొద్దుటూరు : రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్ బాషా హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్చన థియేటర్, మేదర వీధి పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి నుంచి అప్రోచ్ రోడ్డు వేయించాలని ప్రజలు అడుగగా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఉచితంగా దుస్తులు అందజేత



వరికుంట్లలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ప్రసాద్‌రెడ్డి

కాశినాయన : మండలంలోని వరికుంట్ల ఆర్సీఎం చర్చి పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 125 మంది వృద్ధులకు పోరుమామిళ్లలోని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత, చిత్తాతోమాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిస్మస్, నూతన సంవత్సరాలను పురస్కరించుకుని ప్రతి ఏటా పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద వృద్ధులు పండుగను సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశ్యంతోనే వారికి దుస్తులను అందించామన్నారు. కార్యక్రమంలో విచారణ గురువులు ఫాదర్ జయరాజ్, ఉపదేశులు, వృద్ధులు సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మినుము పంట నూర్పిడి ముమ్మరం



పెద్ద మిషన్‌తో మినుము పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం



కూలీలు కోత కోసిన పంటను చిన్న మిషన్ ద్వారా నూర్పిడి చేస్తున్న దృశ్యం

ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన మినుము పంట నూర్పిళ్లు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఈ పంట సాగైంది. కొందు పెద్ద మిషన్లతోనూ మరింతమంది కూలీలతో పంట కోత తీయిస్తున్నారు. ఎకరాకు 2 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని, ఈ ఏడాది ఖర్చు ఎక్కువ కావడంతో నష్టాలు మిగుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం మినుము పంటకు బీమా సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

– రాజుపాళెం

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఊరేగింపు



పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బుశెట్టి రాంమోహన్ తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లో ఆయన కాంస్య విగ్రహానికి ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు 56 రోజుల ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను అర్పించిన మహనీయుడని కొనియాడారు. ముందుగా అమ్మవారిశాల నుంచి లైటుపాళెం వరకు ఆర్యవైశ్యులు ఊరేగింపుగా చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శి మురికి సుబ్రహ్మణ్యం, విద్యానిధి చైర్మన్ డాక్టర్ వెంకటరావు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత



విద్యార్థినులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న బండారు సూర్యనారాయణ తదితరులు

ప్రొద్దుటూరు కల్చరల్ : కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత సాధ్యమవుతుందని తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ అన్నారు. స్థానిక తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో ప్రతిభ చూపిన ముగ్గురు పేద విద్యార్థినులకు రూ.52 వేల ఆర్థిక సహాయాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ తొగటవీర క్షత్రియ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆర్థికసహాయం అందచేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. అనంతరం ఎంబీబీస్ విద్యార్థిని గాలి శ్రీలీనాకు రూ.25 వేలు, అగ్రికల్చర్ బీఎస్సీ విద్యార్థిని బంగారు లావణ్యకు రూ.17వేలు, ఇంటర్ చదువుతున్న గంజికుంట శ్రావణికి రూ.10 వేల సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి చౌడం వెంకటరమణ, కోశాధికారి గంజికుంట ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు పట్టు పోగుల నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, సుబ్బరాయుడు, రామయ్య, సుబ్బయ్య, పుల్లయ్య, లక్ష్మీనారాయణ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు



తక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట గ్రామంలో రెండు చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటి ద్వారా ఇప్పటికే పశువులు, జీవాలు మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గ్రామంలోని పశువుల ఆసుపత్రి ఆవరణలో రెండు అడుగుల ఎత్తులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా దీని చుట్టూ మట్టి పేరుకుపోవడంతో పాటు దానిపై మొక్కలు మొలవడంతో పశువులు గడ్డికోసం వచ్చి విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాత పడుతున్నాయి. దీంతో పాటు గ్రామ సచివాలయం వద్ద కేతవరం వెళ్లే రోడ్డు పక్కన మరో ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చిమొక్కల మధ్య ప్రమాకరంగా ఉంది. ఇక్కడ కూడా పశువులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తులో ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముస్లిం శ్మశాన వాటికకు భూమిపూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్ కాలనీలో నివసిస్తున్న ముస్లింలకు శ్మశానవాటిక ఏర్పాటుకు ఆదివారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి భూమిపూజ చేశారు. రెండు రోజుల క్రితం కాలనీ వాసులు ఎమ్మెల్సీ దగ్గరకు వచ్చి శ్మశానవాటిక సమస్య వివరించారు. దాంతో ఎమ్మెల్సీ వైస్ ఎంపీపీ బాషాతో మాట్లాడారు. మండల నిధులతో స్మశాన వాటిక ఏర్పాటుకు, ప్రహరీ నిర్మాణం చూడాలని చెప్పారు.

ఆ మేరకు ఆదివారం మండల నిధుల నుండి శ్మశానవాటికకు రూ.5 లక్షలు ఖర్చు చేసేందుకు వైస్ ఎంపీపీ బాషా అంగీకారం తెలుపడంతో ఆదివారం ఎమ్మెల్సీ భూమిపూజ చేశారు. రెండు రోజుల్లో ఇచ్చిన మాట అమలు చేసిన గోవిందరెడ్డిని ముస్లింలు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

రాయలసీమ డిక్లరేషన్ పేరుతో బీజేపీ నాటకం



మాట్లాడుతున్న రాంభూపాల్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: డిక్లరేషన్ పేరుతో నాటకాలాడిన బీజేపీ రాయలసీమ ద్రోహిగా మారిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు.

నగరంలోని వైఎస్‌ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ విషయంలో సెయిల్, నాణ్యత పేర్లతో కపట నాటకం ఆడుతోందన్నారు. కేంద్ర బడ్జెట్‌లోనూ ఎలాంటి కేటాయింపులు చేయకుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. టీడీపీ మద్దతుతోనే ఎన్డీయే ప్రభుత్వం కొనసాగుతోందని, ఆ పార్టీలు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీపై స్పష్టత సాధించాలన్నారు. రాష్ట్రంలో పరిస్థితులను ఆసరాగా చేసుకుని కేంద్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాణ్యత, ఫీజుబిలిటీ పేరుతో ఎంపీ సిఎం.రమేష్‌ను నిరాహార దీక్షకు పురమాయించి నాటకమాడారని, ఇపుడు ఆ ఎంపీ కూడా నోరు మెదపడం లేదని నిలదీశారు. వలసలు, రోడ్డు ప్రమాదాలు, వ్యవసాయ కూలీలు, కరువు కాటకాలతో దేశంలోనే వెనుకబడిన రాయలసీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడానికి 14 ఏళ్లు తీసుకుంటారా అంటూ ఉద్వేగంతో ప్రశ్నించారు. ఫిబ్రవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహా సభల్లో కడప ఉక్కు ఉద్యమం ఉవ్వెత్తున జరిపేందుకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామమోహన్, మనోహర్, అన్వేష్, కామనూరు శ్రీనివా సులరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

బద్వేలు అర్బన్ : పట్టణంలోని సుందరయ్యకాలనీలో డీవైఎఫ్ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుమన్ కోట, డాక్టర్ వై.వి.సరస్వతి, డాక్టర్ పవిత్రల ఆధ్వర్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు, స్త్రీలకు వైద్యపరీక్షలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ నిరుపేదలు నివసిస్తున్న సుందరయ్యకాలనీలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించేందుకు సహకరించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, రూరల్ కార్యదర్శి బాలగురయ్య, మహిళా కో కన్వీనర్ ఫాతిమా, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శిక్షణ

పోరుమామిళ్ల : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై ఈనెల 17, 18 తేదీల్లో అధికారులకు, ప్రజాప్రతినిధులకు సభాభవనంలో శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ రమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ శిక్షణ సౌలభ్యం కోసం రంగసముద్రం ఆర్‌బీఎస్‌లో, సభా భవనంలో రెండు బ్యాచులకు శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులందరూ శిక్షణకు హాజరు కావాలన్నారు.

కోబలి పాట ఆవిష్కరణ

ప్రొద్దుటూరు : ప్రేమ్‌కుమార్ వలపల నిర్మాతగా బాల్కనీ స్టూడియోస్ నిర్మాణంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రొద్దుటూరు దసరా డాక్యుమెంటరీని నిర్మిస్తున్నారు. ప్రొద్దుటూరు దసరా డాక్యుమెంటరీకి సంబంధించి కోబలి ప్రత్యేక పాటను కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవీ రెడ్డి ఆదివారం కడపలో ఆవిష్కరించారు. ఈ పాటకు సంగీతం యశ్వంత్‌నాగ్ అందించారు. ప్రొద్దుటూరు దసరా వైభవాన్ని కళ్లకు కట్టినట్లుగా చూపించేలా ఉండే ఈ డాక్యుమెంటరీ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి.

గుంటూరు మహాగర్జనకు తరలివెళ్లిన మాలలు

పోరుమామిళ్ల : గుంటూరు మాలల మహాగర్జనకు ఆదివారం పోరుమామిళ్ల నుండి మాలలు తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్వహిస్తున్న సభలో పాల్గొనేందుకు వెళ్లారు. వెళ్లిన వారిలో జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, అంబేడ్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాదరావు, నాయకులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు



అన్నప్రసాదం వడ్డిస్తున్న రాజగోపాల్‌యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన జరిపి పూలతో అలంకరించారు. అనంతరం లోక కళ్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమం, చండీ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమ ద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రా చార్యులు ఆలయ కమిటీ సభ్యులు, వెంకటేశ్వరశర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

■ స్థానిక టూటౌన్ సమీపంలోని పెద్దమ్మతల్లి మందిరంలో అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మ వారికి కర్పూర హారతులిచ్చారు. మధ్యాహ్నం శ్రీకృష్ణాలయ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో చల్లా మహేష్‌యాదవ్, చల్లా రవిశంకర్‌యాదవ్, శ్రీనివాసులు యాదవ్, రమణ, శివ, దస్తగిరి, ప్రసాద్, హరీష్, రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక పాత మార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా లలితాదేవికి, రతనాల వేంకటేశ్వరస్వామి, దేవతా మూర్తుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేసి నైవేద్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వైభవంగా కాశినాయన ఆరాధన



రాజుపాళెం: గోపాయపల్లెలో ప్రత్యేక అలంకరణలో కాశినాయన

రాజుపాళెం : మండలంలోని గోపాయపల్లె సమీపంలోని సద్గురు కాశినాయన ఆలయంలో ఆదివారం 29వ ఆరాధన వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి కాశినాయనకు ప్రత్యేక అభిషేకాలు జరిపారు. మహిళలు విష్ణు, లలిత సహస్రనామ, భగవద్గీత పారాయణాలు, తాళాల భజన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. కాశిరెడ్డి నాయన సేవాసంఘం నిర్వాహకులు అన్నదానం చేశారు. రాత్రి ప్రొద్దుటూరు శ్రీమన్నారాయణ భక్త బృందం చేసిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అలాగే జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం వైభవంగా జరిగింది. అలాగే కొర్రపాడులోని కాశిరెడ్డి నాయన ఆలయం వద్ద స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. న్యాయవాది భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

ఘనంగా గరుడసేవ మహోత్సవం



గరుడసేవ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : మండలంలోని లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన గరుడసేవ మహోత్సవంలో ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వేదపండితులు ఎమ్మెల్సీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. గరుడ వాహనంపై కొలువుదీర్చిన స్వామివారికి పూజలు నిర్వహించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గరుడవాహనధారి అయిన శ్రీవారిని దర్శించుకోవడం సర్వపాప పరిహారణకు మూలమని అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్‌కన్వీనర్ల సమన్వయ కర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, సర్పంచ్ కుప్పాలరమణ, పార్టీ సీనియర్ నాయకులు పుత్తాశ్రీరాములు, రఘురామిరెడ్డి, వరలక్ష్మి, వెంకటసుబ్బమ్మ, రజనీకాంత్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



17 ఏళ్ల తర్వాత కలుసుకున్న 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

దువ్వూరు(చాపాడు) : మండల కేంద్రమైన చైతన్య హైస్కూల్‌లో 2006-2007 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా దువ్వూరులోని కానాల ఫంక్షన్ హాల్‌లో 17 ఏళ్ల తర్వాత కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు అప్పటి ఉపాధ్యాయులు సరస్వతి, నరసయ్య పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగనిరతి నేటి తరానికి ఆదర్శం



పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



అట్లూరులో పొట్టి శ్రీరాములు చిత్రటానికి నివాళులు అర్పిస్తున్న గ్రంథాలయ అధికారి



చాపాడు: పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి



బ్రహ్మంగారిమఠం: ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

బద్వేలు అర్బన్ : రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాలని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలని ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.వి.సుబ్బారావు, కొలిశెట్టి నాగరాజులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక సిద్ధవటంరోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరజీవి ఆత్మత్యాగ ఫలితంగానే ఆంధ్రరాష్ట్ర అవతరణ జరిగిందన్నారు. అలాగే అవోపా, ఆర్యవైశ్య మహిళా విభాగం, వాసవీక్లబ్, వనితక్లబ్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్, వస్త్రదుకాణాల, కిరాణా మర్చంట్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్ పి.వి.ఎన్.ప్రసాద్, అవోపా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెయ్య, నాగేశ్వర్‌రావు, ఆర్యవైశ్య మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు కొండపల్లిదేవి, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భార్గవ్, సుధాకర్, వనితక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జ్యోతిర్మయి, శ్రీదేవి, కెమిస్ట్‌అండ్‌డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు వర్ధంతి

అట్లూరు : స్థానిక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి గ్రంథాలయ అధికారి ఎం.సుధాకర్ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహానికి నివాళి

పోరుమామిళ్ల : ఆంధ్రరాష్ట్ర సాధనకు ఆమరణదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆదివారం ఎస్టీయూ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు రామకృష్ణారెడ్డి, చంద్రహాసరెడ్డి ఆయన ప్రాణత్యాగంతో ప్రత్యేక రాష్ట్రం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

చాపాడు : నేటి తరానికి అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శప్రాయుడని గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారి మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన కృషి, అమరణ నిరాహార దీక్ష మరువలేనిదన్నారు. నేటి యువత ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.

బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.